సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం । 5 । ఆగస్టు । 2026

నెలలో వివాహం.. అంతలోనే విషాదం

నెల రోజుల్లో వివాహం జరగనున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. -8లో

ఖాకీ వనంలో కలకలం

ప్రొద్దుటూరులో వ్యభిచారం కేసు వ్యవహారంలో ముగ్గురు కానిస్టేబుళ్లపై వేటు పడింది. -8లో

గరిష్టం/కనిష్టం
35.0 /26.0

వాతావరణం

జిల్లాలో మంగళవారం 26.0 - 35.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.1 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి. గాలిలో తేమ మధ్యాహ్నం 83 శాతం మధ్య నమోదైంది.

న్యూస్‌లీల్

ఇస్రో శాస్త్రవేత్తగా సచివాలయ ఉద్యోగి

రమేష్‌కుమార్

కలసపాడు : మండలంలోని శంఖవరం గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగి సి.వి.రమేష్‌కుమార్ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) పరిధిలోని విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ – తిరువనంతపురం)కు శాస్త్రవేత్తగా ఎంపికయ్యారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో ఆయన ఈ అరుదైన ఘనత సాధించారు. రమేష్‌కుమార్ గతంలో కలసపాడు మండలంలోని పిడుగుపల్లె, కలసపాడు సచివాలయాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించారు. రైతు కుటుంబంలో పుట్టి కఠిన శ్రమ, నిరంతర కృషితో ఇస్రోలో శాస్త్రవేత్త ఉద్యోగం సాధించడం తన జీవితంలో మరువలేని అనుభూతిని ఇచ్చిందని రమేష్‌కుమార్ ఆనందం వ్యక్తం చేశారు.

జిల్లా స్థాయి ఎంపికలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈనెల 10, 11 తేదీల్లో అమరావతి చాంపియన్‌షిప్ జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీఓ గౌస్‌బాష తెలిపారు. ఈ ఎంపికలు 12 క్రీడాంశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఎంపిక చేసిన అండర్–19, 23 బాలబాలికలు హాజరుకావాలన్నారు. 10న డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో ఆర్చరీ, అథ్లెటిక్స్, హాకీ, వెయిట్‌లిఫ్టింగ్, 11న డీఎస్ఏ క్రీడా మైదానంలో బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, చెస్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా వంటి క్రీడా పోటీలు ఉంటాయన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఆయా తేదీల్లో పాల్గొనాలన్నారు.

కలెక్టరేట్ ఏఓగా నాగేశ్వరరావు

కడప సెవెన్‌రోడ్స్ : కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారిగా నాగేశ్వరరావుకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కడప అర్బన్ తహసీల్దార్‌గా ఉంటున్న నాగేశ్వరరావుకు కలెక్టరేట్ ఏఓ బాధ్యతలను అదనంగా అప్పగించారు.

మెరుగైన సేవలు అందించాలి

మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్

చెన్నూరు (వల్లూరు) : చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ యుగంధర్ సందర్శించి, ప్రయోగశాల (ల్యాబ్), ఫార్మసీని పరిశీలించి, అందుతున్న సేవల అమలును సమీక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలను సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆశాదినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆశా అజెండా గురించి వివరించారు. అలాగే హోమ్–బేస్డ్ న్యూబోర్న్ కేర్ మరియు హోమ్–బేస్డ్ యంగ్ చైల్డ్ కేర్ కిట్ల ప్రాముఖ్యతను వివరించి, తల్లి–శిశు ఆరోగ్య సేవలను గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయడానికి ఈ కిట్లను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా వినియోగించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు, మెడికల్ ఆఫీసర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా కందుల

కడప ఎడ్యుకేషన్ : ప్రోగ్రెసివ్ రికగ్నైజ్‌డ్ టీచర్ యూనియన్ (పీఆర్‌టీయూ) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన సీనియర్ ఉపాధ్యాయులు కందుల వెంకటసుబ్బారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా క్రిష్ణయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌లు నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికైన కందుల వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ పీఆర్‌టీయూ బలోపేతంతోపాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం మరింత కృషి చేస్తానన్నారు.

7న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ఎస్‌డీసీ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి అందెల సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నగర శివార్లలోని చెన్నై–హైదరాబాదు బైపాస్‌లోని ఉక్కాయపల్లెలోగల నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో నిర్వహించే ఈ జాబ్‌లో సుమారు 17 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ చదివి 18–55 సంవత్సరాల వయస్సు మధ్యగల వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని, అభ్యర్థులు తమ విద్యార్హతల ధృవపత్రాలు, ఫోటోలతో హాజరు కావాలని ఆయన కోరారు.

చినుకు చినుకు అందెలతో..
చిటపట చినుకులతో..

కడప జిల్లా ఖరీఫ్ ఆరుతడి పంటల సాగు విస్తీర్ణం

క్రమ సంఖ్య	పంట పేరు	వర్షాధార సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
1	పత్తి	3,671
2	వేరుశనగ	1,353
3	మినుము	420
4	సన్‌ఫ్లవర్	207
5	సోయాబీన్	114
6	సజ్జ	81
7	కంది	69
8	ఆముదం	57
9	మొక్కజొన్న	30
	మొత్తం వర్షాధార సాగు	6,002 హెక్టార్లు
	మొత్తం నీటి ఆధారిత (బోర్లు) సాగు	7,065 హెక్టార్లు
	జిల్లా మొత్తం ఆరుతడి సాగు	13,067 హెక్టార్లు

- జిల్లావ్యాప్తంగా వాన ఊరట
- ఆరుతడి పంటలకు 'జీవన'దానం

కడప అగ్రికల్చర్ : జిల్లాలో కరువు ముంగిట 'చినుకు' భరోసా లభించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు కురిసిన వర్షం అన్నదాతలకు కొండంత ఊరటనిచ్చింది. ఈ వాన రాకతో జిల్లావ్యాప్తంగా ఆరు మండలాల్లో మినహా మిగతా అన్ని ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా చల్లబడటమే కాకుండా, ఎండిపోతున్న పంటలకు సరికొత్త జీవం పోసింది. ఈ ఏడాది 'ఎల్‌నినో' తీవ్ర ప్రభావంతో సకాలంలో వర్షాలు కురవక, భూగర్భ జలాలు దారుణంగా అడుగంటిపోయి రైతులు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. ఇక వర్షాలు రావనుకున్న తరుణంలో.. ఈ వాన పడటంతో వారిలో మళ్లీ కొత్త ఆశలు చిగురించాయి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో సాగులో ఉన్న వేరుశనగ, కంది, మినుము, పత్తి, జొన్న, సజ్జ వంటి ఆరుతడి పంటలకు ఈ వర్షపు తేమ అమృతంలా మారిందని వ్యవసాయ అధికారులు స్పష్టం చేస్తున్నారు. లభించిన వర్షపు నీటిని ఉపయోగించుకుని రైతాంగం పొలాల్లో అంతరకృషి (కలుపు తీయడం, ఎరువులు వేయడం) పనులను ముమ్మరం చేసింది.

ఆరుతడి పంటల సాగుకు ఎంతో అనుకూలం

జిల్లాలో ప్రస్తుతం కురిసిన వర్షాలు కంది, మొక్కజొన్న, మినుము, వేరుశనగ పంటల సాగుకు ఎంతో అనుకూలమని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఇప్పటి నుంచి అప్పుడప్పుడు ఇలాగే వర్షాలు కురిస్తే పంట దిగుబడులు బాగుండి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అధికారులు, రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ఈ వాన మాత్రం కరవు పరిస్థితుల నడుమ నిలబడిన అన్నదాతకు కొండంత ఊరట నిచ్చిందని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది.

బోరు బావుల పంటలకు 'టానిక్'

జిల్లావ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో బోరు బావుల ఆధారంగా 7,065 హెక్టార్లలో విభిన్న ఆరుతడి పంటలను సాగు చేశారు. వీటికి బోర్ల ద్వారా నీటి తడులను అందిస్తున్నప్పటికీ.. తీవ్రమైన ఎండలు, వేడి గాలుల వల్ల ఆశించిన స్థాయిలో పంట ఎదుగుదల లేదు. కానీ ప్రస్తుతం కురిసిన వర్షం ఈ బోరు ఆధారిత పంటలకు కూడా ఒక రకమైన 'టానిక్' లాగా పనిచేయనుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షంతో భూమి కాసింత చల్లబడటంతో ఇకపై వేరుశనగ, పత్తి, మొక్కజొన్న, సన్‌ఫ్లవర్, మినుము పంటలు ఏపుగా పెరగనున్నాయి.

సరిగ్గా సమయానికి పడిన వాన

ఈ సాగైన ఆరుతడి పంటలు ఇంకో పది, పదిహేను రోజులు గడిచి ఉంటే వర్షాభావం వల్ల పూర్తిగా ఎండుముఖం పట్టే దశకు చేరుకునేవి. అలాంటి క్లిష్ట సమయంలో కురిసిన ఈ వర్షం పంటలకు నిజంగా జీవం పోసినట్లయింది. కడప మండలంలో అత్యధికంగా 34.6 ఎంఎం వర్షపాతం నమోదు కాగా.. సుండుపల్లి, పెద్దముడియం, మైలవరం, పెండ్లిమర్రి తదితర మండలాల్లోనూ పడిన వర్షం పంటల సాగుకు కొండంత అండగా నిలిచింది.

కడపలో అత్యధికం

జిల్లావ్యాప్తంగా ఆరు మండలాల్లో మినహా మిగతా అన్ని మండలాల్లో సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకు వర్షం కురిసింది. ఇందులో భాగంగా కడప మండలంలో అత్యధికంగా 34.6 ఎంఎం వర్షం కురిసింది.

మండలం పేరు	వర్షపాతం ఎంఎం
కడప	34.6
సుండుపల్లి	31.2
పెద్దముడియం	29.0
మైలవరం	21.5
పెండ్లిమర్రి	20.2
చింతకొమ్మదిన్నె	17.4
కమలాపురం	17.2
వల్లూరు	16.4
కలసపాడు	15.2
లింగాల	15.2
చెన్నూరు	14.2
పులివెందుల	14.0
జమ్మలమడుగు	13.4
ప్రొద్దుటూరు	12.8
సింహాద్రిపురం	12.6
వీరపునాయునిపల్లె	11.4
ఎర్రగుంట్ల	10.2
తొండూరు	10.2
గోపవరం	10.2
రాజుపాలెం	10.0
ఖాజీపేట	8.2
బి.కోడూరు	8.0
సిద్ధవటం	7.2
బ్రహ్మంగారిమఠం	6.2
ఒంటిమిట్ట	6.6
దువ్వూరు	5.4
చక్రాయపేట	5.2
వేముల	5.0
వేంపల్లి	4.2
వీరబల్లి	4.2
ముద్దనూరు	3.2
కాశినాయన	3.2
కొండాపురం	2.8
చాపాడు	2.6

కమలాపురం, ముద్దనూరు స్టేషన్లలో తిరుమల స్టాపింగ్

- ఎంపీ అవినాష్‌రెడ్డి చొరవ

ముద్దనూరు: కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి చొరవతో నియోజకవర్గ పరిధిలోని రెండు ప్రధాన రవాణా సమస్యలకు కేంద్ర ప్రభుత్వ విభాగాల నుంచి సానుకూల స్పందన లభించింది. కమలాపురం, ముద్దనూరు రైల్వే స్టేషన్లలో తిరుమల ఎక్స్‌ప్రెస్ నిలుపుదలకు గుంతకల్ రైల్వే డివిజన్ ఆమోదం తెలిపింది. అలాగే, చెన్నూరు జాతీయ రహదారి 40 వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు సర్వీస్ రోడ్లు, బస్ షెల్టర్ల నిర్మాణాన్ని ప్రాధాన్యతా క్రమంలో చేపట్టేందుకు ఎన్‌హెచ్ఏఐ చైర్మన్ హామీ ఇచ్చారు.

తిరుమల ఎక్స్‌ప్రెస్ నిలుపుదలకు గుంతకల్ డివిజన్ గ్రీన్ సిగ్నల్

కమలాపురం, ముద్దనూరు రైల్వే స్టేషన్లలో తిరుమల ఎక్స్‌ప్రెస్ (రైలు నెం. 18521/18522) హాల్టింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ కడప ఎంపీ వై.ఎస్.అవినాష్ రెడ్డి సమర్పించిన విజ్ఞప్తిపై గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా స్పందించారు. ఈ ప్రతిపాదనను డివిజనల్ స్థాయిలో ఆమోదించి, తదుపరి పరిశీలన కోసం రైల్వే బోర్డు ప్రధాన కార్యాలయానికి పంపినట్లు వెల్లడించారు.

సర్వీస్ రోడ్ల నిర్మాణానికి చైర్మన్ హామీ

ఎన్‌హెచ్–40 పరిధిలోని కడప–కర్నూలు సెక్షన్‌లో చెన్నూరు పట్టణం వద్ద సర్వీస్ రోడ్లు, బస్ షెల్టర్లు, కవర్డ్ డ్రైన్ల నిర్మాణాన్ని అత్యవసరంగా చేపట్టాలని ఎంపీ న్యూఢిల్లీలో ఎన్‌హెచ్ఏఐ చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌కు విజ్ఞప్తి చేశారు. గతంలో స్థానిక ప్రతిఘటనలు, కోర్టు కేసుల కారణంగా 2022లో పనులు పూర్తయినా సర్వీస్ రోడ్లు నిర్మించలేదని, దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ప్రస్తుతం స్థానిక ప్రజలు భూములిచ్చేందుకు అంగీకరించినందున పనులు ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని కోరగా, చైర్మన్ సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కత్తులు దూస్తున్న
స్థానిక కురుక్షేత్రం!

- నోటిఫికేషన్‌కు ముందే ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావాహులు
- సాంకేతిక అవరోధాల నడుమ చంద్రబాబు రాజకీయం
- అక్టోబర్‌లో ఎన్నికలు సాధ్యమేనా?

కడప సెవెన్ రోడ్స్ : స్థానిక సంస్థల ఎన్నికల ముచ్చట తెరపైకి రాగానే ఉమ్మడి జిల్లాలోని ఆశావాహుల్లో ఒక్కసారిగా ఉత్సాహం నెలకొంది. టికెట్ ఆశిస్తున్న నేతలు అప్పుడే ముఖ్య నాయకులను, ముఖ్యంగా ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో బిజీగా మారిపోయారు. క్షేత్రస్థాయిలో విస్తృత పర్యటనలు చేస్తూ.. గ్రామస్థాయిలోని చోటా లీడర్లను ఎలాగైనా తమ వైపు తిప్పుకునేందుకు సామ దాన బేధ దండోపాయాలను ప్రయోగిస్తున్నారు. ముఖ్యంగా అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు అప్పుడే శక్తికి మించిన హామీలు గుప్పిస్తున్నారు. వీలైనన్ని చోట్ల బెదిరింపులతోనో, ప్రలోభాలతోనో ఏకగ్రీవాలు చేసుకోవాలని ఇప్పటి నుంచే తెరవెనుక పావులు కదుపుతుండటం గమనార్హం. నోటిఫికేషన్ రాకముందే క్షేత్రస్థాయిలో ఈ రేంజ్ పొలిటికల్ హీట్ ఉంటే, ఇక నోటిఫికేషన్ వెలువడ్డాక ఇంకెంత సందడి నెలకొంటుందోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

కోర్టు మొట్టికాయలతోనే 'స్థానిక' చలనం

రాష్ట్రంలో అక్టోబరులో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన హఠాత్ ప్రకటన వెనుక అసలు గుట్టు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. నిబంధనల ప్రకారం.. స్థానిక సంస్థల పాలకవర్గాలు రద్దు కాగానే నిర్దిష్ట గడువులోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఎన్నికలకు వెళితే ఘోరమైన ప్రతికూల ఫలితాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ముందే ఊహించి, రకరకాల కుంటిసాకులతో ఎన్నికలను ఇన్నాళ్లూ వాయిదా వేయిస్తూ వచ్చింది. అయితే, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు) తీవ్రంగా జోక్యం చేసుకుని గడువు విధించడంతో.. ఇప్పుడు కూటమి సర్కారుకు ఎన్నికలకు వెళ్లక తప్పని సరిస్థితి ఏర్పడిందని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

సాంకేతిక అవరోధాల నడుమ చంద్రబాబు 'స్థానిక' రాజకీయం

రాష్ట్రంలో అక్టోబరులో స్థానిక సంస్థల ఎన్నికలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్తున్న మాటలు ఆచరణలో సాధ్యం కాదని రాజకీయ విశ్లేషకులు తేల్చి చెబుతున్నారు. ఎన్నికల నిర్వహణకు ముందు పూర్తి కావాల్సిన మున్సిపల్ చైర్మన్లు, వార్డుల రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ ఇంకా ఎక్కడికక్కడే నిలిచిపోయింది. మరోవైపు వచ్చే సెప్టెంబరులో మండల పరిషత్‌ల పదవీ కాలం ముగియనుంది. ఆ తర్వాతే ఎంపీటీసీ, జడ్పీటీసీ, మండల పరిషత్ అధ్యక్ష పదవులకు రిజర్వేషన్లు తేల్చాల్సి ఉంది. ఇవన్నీ కాకుండా ఓట్ల సవరణ (సర్) ప్రక్రియ కూడా ఇంకా పూర్తి కాలేదు. గ్రామ పంచాయతీల కాలపరిమితి ఎప్పుడో ముగిసినప్పటికీ, ఓట్ల జాబితా తేలకుండా ఎన్నికల సంఘం అనుమతితో ప్రక్రియ చేపట్టడం కూడా అంత సులువు కాదు. ఈ నేపథ్యంలో, అక్టోబరులో ఎన్నికలు జరగడం అసాధ్యమనే స్పష్టత వస్తోంది.

వైఎస్సార్ కడప జిల్లా ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకారం ఓటర్ల వివరాలు

మహిళా ఓటర్లు	8,41,337 మంది
పురుష ఓటర్లు	8,09,839 మంది
సర్వీసు ఓటర్లు	2,217 మంది
థర్డ్ జెండర్ ఓటర్లు	136 మంది
మొత్తం ఓటర్ల సంఖ్య	16,51,312 మంది

ఇదంతా కేవలం 'క్యాడర్' కోసమే?

చంద్రబాబు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఎప్పుడూ స్థానిక సంస్థల ఎన్నికలను సకాలంలో నిర్వహించిన దాఖలాలు లేవని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు కూడా ఇన్ని సాంకేతిక, న్యాయపరమైన అవరోధాలు అడ్డుగా ఉన్నాయని తెలిసి కూడా.. ×అక్టోబరులో ఎన్నికలు? అంటూ ఆయన పదేపదే హడావుడి చేయడం వెనుక అసలు రహస్యం వేరే ఉందనే చర్చ తమ్ముళ్లలోనే నడుస్తోంది. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక తీవ్ర అసంతృప్తితో ఉన్న తమ పార్టీ క్యాడర్‌లో ఎలాగైనా పొలిటికల్ జోష్ నింపేందుకే బాబుగారు ఈ ఎన్నికల పల్లవి అందుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియకు అవసరమైన ప్రాథమిక కసరత్తు కూడా మొదలు పెట్టకుండా, కేవలం బహిరంగ ప్రకటనల ద్వారా పార్టీ శ్రేణులను మభ్యపెట్టేందుకే కూటమి సర్కార్ ఈ సరికొత్త రాజకీయ డ్రామాకు తెరలేపిందని రాజకీయ వర్గాలు నిప్పులు చెరుగుతున్నాయి.

అసలు అక్టోబర్‌లో ఎన్నికలు సాధ్యమేనా?

స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ఓవైపు చెబుతున్నప్పటికీ.. ఆచరణలో అది ఇప్పట్లో సాధ్యం కాదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలు నిర్వహించాలంటే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో రిజర్వేషన్ల ప్రక్రియ ఖరారు కావాల్సి ఉంది. ముఖ్యంగా కడప నగరపాలక సంస్థ పరిధిలో డివిజన్ల రిజర్వేషన్ల వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారి హైకోర్టు పరిధిలో ఉంది. దీనికి తోడు ఓటర్ల జాబితాకు ఇంకా తుది రూపమే రాలేదు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా ముసాయిదా జాబితాను గత నెల 31న విడుదల చేశారు. ఈ ప్రక్రియ ప్రకారం రాబోయే అక్టోబరు 3వ తేదీన మాత్రమే ఓటర్ల తుది జాబితా వెలువడనుంది. ఆ తర్వాతే గ్రామ పంచాయతీల వారీగా ఓటర్ల సంఖ్యను విడదీసి తేల్చాల్సి ఉంటుంది. అంతవరకు అసలు నోటిఫికేషన్ ఇచ్చేందుకే వీలుపడదు.

సెప్టెంబరు 24తో జెడ్పీ, మండల పరిషత్‌ల రద్దు

ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం 50 జెడ్పీటీసీ స్థానాలు, 554 ఎంపీటీసీ స్థానాలు, 619 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో ఇప్పటికే సర్పంచుల కాల వ్యవధి ముగిసి పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి. మరోవైపు, జెడ్పీటీసీ, ఎంపీపీ పాలకవర్గాల కాల వ్యవధి కూడా సెప్టెంబరు 24తో పూర్తిగా ముగియనుంది. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీలతో పాటు జడ్పీటీసీ, ఎంపీటీసీ మరియు గ్రామ పంచాయతీ ఎన్నికలను కూడా ఒకేసారి నిర్వహించాలని ఎన్నికల కమిషన్ యోచిస్తున్నట్లు సమాచారం. ఈ నెల 6వ తేదీన (గురువారం) రాష్ట్రఎన్నికల సంఘం ఉన్నతాధికారులతో జరగబోయే కీలక సమావేశంలో దీనిపై స్పష్టత రానుంది.

'సీమ'కు నీరివ్వకుండా కిందికి వదిలితే ఖబడ్దార్!

- శ్రీశైలం నీరు విడుదల చేయకపోతే ప్రత్యక్ష పోరాటాలు తప్పవు
- వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, చిత్రంలో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష, మాజీ మేయర్ కె.సురేష్‌బాబు, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ : 'శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం పూర్తి స్థాయికి చేరకుండా, రాయలసీమ ప్రాజెక్టులకు సాగు, తాగునీరు అందించకుండా.. విద్యుత్ ఉత్పాదన పేరిట అడ్డగోలుగా నీటిని దిగువకు వదిలితే తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేపడతాం' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర కూటమి ప్రభుత్వాన్ని గట్టిగా హెచ్చరించారు. మంగళవారం కడప లోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నేతలు చంద్రబాబు తీరుపై ధ్వజమెత్తారు.

'సీమ'వ్యాప్తంగా ప్రత్యక్ష పోరాటాలు

ఈ సమావేశంలో మాజీ మేయర్ కె.సురేష్‌బాబు మాట్లాడుతూ రాయలసీమ ప్రాజెక్టులకు సాగునీటిని అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత ఒక్క వైఎస్సార్ కుటుంబానికే దక్కుతుందని స్పష్టం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన ప్రతిసారి సీమ ప్రాజెక్టులకు నిధులు ఇవ్వకుండా తొక్కిపెడుతున్నారని విమర్శించారు. గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏకంగా వెయ్యి కోట్లు ఖర్చు చేసి, నిర్వాసితులకు పరిహారాలు అందించి గండికోట జలాశయంలో రికార్డు స్థాయిలో 24 టీఎంసీల నీటిని నిల్వ చేసి నిరూపించిందన్నారు. తక్షణమే శ్రీశైలం నుంచి సీమ కాల్వలకు నీటిని విడుదల చేయకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రత్యక్ష పోరాటాలకు దిగుతామన్నారు.

జగనన్న తెచ్చిన స్కీమ్‌పై 'కూటమి' డ్రామాలు

మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాష మాట్లాడుతూ.. ఎగువన జూరాల నుంచి రెండు లక్షల క్యూసెక్కుల పైబడి భారీ వరద ప్రవాహం వస్తుండటంతో శ్రీశైలంలో నీటిమట్టం ఇప్పటికే 100 టీఎంసీలకు చేరిందన్నారు. రాయలసీమలో తాగు, సాగునీటికి తీవ్ర కటకట ఏర్పడిన నేపథ్యంలో వెలిగోడు, బ్రహ్మంసాగర్, గోరకల్లు, అవుకు, గండికోట, కేసీ కెనాల్‌లకు తక్షణమే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో బ్రహ్మంసాగర్ నుంచి 1.5 టీఎంసీల నీటిని కడప నగర తాగునీటి అవసరాలకు నిరంతరాయంగా వినియోగించేందుకు రూ.575 కోట్ల భారీ అంచనా వ్యయంతో బృహత్తర పథకాన్ని చేపట్టి, టెండర్లు కూడా పూర్తి చేశారని గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ పనులను నిర్లక్ష్యం చేసి, ఇప్పుడు స్థానిక మున్సిపల్ ఈఈ, అధికారులు పాత పనులకే ఎమ్మెల్యే మాధవి చేత రెండోసారి భూమి పూజ చేయించడం ఆశ్చర్యకరమన్నారు. కడప నగరంలో ప్రస్తుతం తాగునీరు మూడు రోజులకు ఒకసారి కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మైలవరం జలాశయం నుంచి కడప నగర అవసరాల కోసం 200 క్యూసెక్కుల నీరు వదిలామని కూటమి నేతలు, అధికారులు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారన్నారు.

బాబు నిష్క్రియాపరత్వం వల్లే అన్యాయం

బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. పొరుగున ఉన్న తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలంలో 800 అడుగుల నుంచే నిస్సిగ్గుగా అక్రమ నీటి తరలింపు చేపడుతున్నా చంద్రబాబుకు చీమకుట్టినట్లు కూడా లేకపోవడం దారుణమన్నారు. జగనన్న హయాంలో చేపట్టిన సీమ లిఫ్ట్ ఇరిగేషన్‌ను పూర్తి చేసి ఉంటే ఈ కరువు కాలంలో 800 అడుగుల నుంచే సీమకు నీరు తీసుకునే పక్కా సౌలభ్యం ఉండేదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, నాయకుడు రమేష్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రచార విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ వినోద్‌కుమార్, చెన్నూరు ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గండి క్షేత్రంలో 13 నుంచి శ్రావణ ఉత్సవాలు

చక్రాయపేట : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గండి శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఈనెల 13వ తేదీ నుంచి శ్రావణమాస ఉత్

క్లుప్తంగా

విమానాశ్రయ మాజీ ఏజీఎంకు జైలు శిక్ష

కడప కోటిరెడ్డిసర్కిల్ : లంచం తీసుకున్న కేసులో నిందితుడైన కడప ఎయిర్‌పోర్టు మాజీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్, అఫీషియేటింగ్ డైరెక్టర్ ఎంఆర్ శ్రీనివాసన్‌కు మూడేళ్ల జైలుశిక్ష, రూ.50 వేల జరిమాన విధిస్తూ కర్నూలు సీబీఐ కేసుల ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి శోభారాణి తీర్పునిచ్చారు. కాంట్రాక్టర్ బిల్లు మంజూరు విషయంలో ఎంఆర్ శ్రీనివాసన్ రూ.50 వేల లంచం డిమాండ్ చేయడంతో ఆయన సీబీఐకి ఫిర్యాదు చేశారు. 2015 జూలై 24న తొలి విడతగా రూ.25 వేలు లంచం తీసుకుంటుండగా సీబీఐ అధికారులు దాడి చేసి పట్టుకుని కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఆయనకు జైలు శిక్ష, జరిమానా విధించారు.

బాలిక అదృశ్యం

చాపాడు : చాపాడుకు చెందిన ప్రియ అనే బాలిక కనిపించలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన రమేష్ కుటుంబం ఇటీవల చాపాడులో నివసిస్తోంది. ఈ క్రమంలో ప్రొద్దుటూరులో ఇంటర్ సెకండియర్ చదువుతున్న ప్రియ సోమవారం ఇంటి నుంచి కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని తండ్రి రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మున్సిపల్ ఆర్ఐ తొలగింపు

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీలోని రెవెన్యూ విభాగంలో పని చేస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేష్‌ను రెవెన్యూ విధుల నుంచి తదుపరి విచారణ పూర్తయ్యే వరకు తాత్కాలికంగా తొలగించినట్లు మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.20 లక్షలు తీసుకుని పూజా స్కూల్ ఆస్తిని బదలాయించినట్లు ఆర్ఐపై ఆరోపణలు రావడంతో విచారణకు ఆదేశించామని ఆయన పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి విచారణ అధికారిని నియమించామని తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఎవరు అవినీతికి పాల్పడినా తనకు గానీ, నేరుగా ఏసీబీకి ఫిర్యాదు చేయవచ్చునని వివరించారు.

బైకును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

– ఒకరి దుర్మరణం

ముదిగుబ్బ: బైకును ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన మేరకు... వైఎస్సార్ కడప జిల్లా లింగాల మండలం అంబకపల్లికి చెందిన మందుగుండు కమలాకర్ (55) వ్యాపార నిమిత్తం ముదిగుబ్బకు వచ్చి స్థిరపడ్డాడు. స్థానికంగా కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మంగళవారం ఉదయం దొరిగిల్లు రోడ్డు సమీపంలో ఉన్న వ్యవసాయ తోటకు వెళ్లి ద్విచక్ర వాహనంలో తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో పులివెందుల డిపో ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా ఢీకొంది. ప్రమాదంలో కమలాకర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఖాకీ వనంలో కలకలం

- వ్యభిచారం కేసు వ్యవహారంలో ముగ్గురు కానిస్టేబుళ్లపై వేటు
- ఒక హెడ్‌కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లు వీఆర్‌కు
- నాడు ఆరుగురు.. నేడు ముగ్గురు!
- 12 ఏళ్ల తర్వాత వన్‌టౌన్‌లో అదే తరహా ఆరోపణలు

కానిస్టేబుళ్లు సాయికిశోర్, శ్రీనివాసులు

హెడ్‌కానిస్టేబుల్ బాలదస్తగిరి

ప్రొద్దుటూరులోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్

ప్రొద్దుటూరు క్రైం : వ్యభిచారం కేసులో పట్టుబడిన మహిళల నుంచి డబ్బు వసూలు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో.. ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ముగ్గురు పోలీస్ సిబ్బందిపై జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ వేటు వేశారు. హెడ్‌కానిస్టేబుల్ దస్తగిరి, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, సాయికిశోర్‌లను కడప వీఆర్‌లో రిపోర్టు చేసుకోవాల్సిందిగా మంగళవారం ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు ముగ్గురు పోలీసు సిబ్బంది కడప హెడ్‌క్వార్టర్‌లో రిపోర్టు చేసుకున్నారు. ఇటీవల ప్రొద్దుటూరులోని ఈశ్వరరెడ్డినగర్ సమీపంలో ఓ ఇంట్లో వ్యభిచారం చేస్తూ పట్టుబడిన మహిళలను.. బెదిరించి వారి నుంచి వన్‌టౌన్ పోలీసు సిబ్బంది డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారం పోలీసు శాఖలో తీవ్ర చర్చకు దారి తీసింది. మహిళల నుంచి నేరుగా నగదు తీసుకోకుండా ఓ వ్యక్తి పోన్‌పే ఖాతాకు పెద్ద మొత్తంలో నగదు బదిలీ చేయించినట్లు ఆరోపణలు రావడంతో.. పోలీసు సిబ్బందిపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించారు. డిజిటల్ లావాదేవీలు, సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలు, సాంకేతిక ఆధారాలను సేకరిస్తూ.. అన్ని కోణాల్లో పోలీసు అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. ఇందులో ఆరోపణలు రుజువైతే తరువరి శాఖాపరమైన చర్యలు ఉంటాయని స్థానిక పోలీసు అధికారులు అంటున్నారు. చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసు సిబ్బందిపైనే ఈ తరహా మహిళల నుంచి డబ్బు వసూలు చేశారనే ఆరోపణలు రావడం తీవ్ర చర్చకు దారి తీసింది. సామాజిక, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న మహిళలను బెదిరించి డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు రుజువైతే అది కేవలం పోలీసుశాఖకు మచ్చ మాత్రమే కాదు.. మానవత్వానికి ప్రశ్నార్థకంగా మారుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఫోన్‌పే చెల్లింపులతో అడ్డంగా దొరికిపోయారు

ఫోన్‌పే చెల్లింపులతో పోలీసులు అడ్డంగా దొరికిపోయారు. డిజిటల్ చెల్లింపులు నేరాల విచారణలో కీలక ఆధారాలుగా మారుతున్నాయి. తాజాగా వ్యభిచారం కేసులో మహిళ నుంచి ఫోన్‌పే ద్వారా జరిగిన రూ.50 వేల బదిలీ వ్యవహారం పోలీసు శాఖలో సంచలనంగా మారింది. నగదు చేతులు మారి ఉంటే ఈ వ్యవహారం బయటపడేదో లేదో కానీ ఫోన్‌పే ద్వారా జరిగిన ట్రాన్సక్షన్ మాత్రం మొత్తం వ్యవహారాన్ని పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చింది. డిజిటల్ ట్రాన్సక్షన్‌కు సంబంధించిన ఆధారాలే విచారణలో కీలకంగా మారడంతో ముగ్గురు పోలీసు సిబ్బందిపై వేటు పడింది.

12 ఏళ్ల తర్వాత అదే స్టేషన్‌లో..

సరిగ్గా 12 ఏళ్ల క్రితం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఒక వ్యభిచారం కేసులో ఆరుగురు సిబ్బందిపై వేటు పడింది. పలువురు పోలీసులు వ్యభిచార నిర్వాహకుల నుంచి డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలపై నాటి పోలీసు అధికారులు.. ఆరుగురిపై చర్యలు తీసుకున్నారు. కాగా అప్పుడు కూడా ఆగస్టు నెలలోనే పోలీసు సిబ్బందిపై వేటుపడటం గమనార్హం. ప్రస్తుతం ముగ్గురు కానిస్టేబుళ్లు వ్యభిచారం వ్యవహారంలోనే ఆరోపణలు ఎదుర్కొంటూ వీఆర్‌కు వెళ్లారు. దీంతో 'నాడు ఆరుగురు.. నేడు ముగ్గురంటూ' పలువురు పోలీసులు అప్పటి ఘటనను గుర్తు చేసుకుంటున్నారు.

డయల్ 100 కాల్‌కు విలువ లేదా?

పోలీసుశాఖలో డయల్ 100 కాల్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన డయల్-100 వ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బతీసేలా తాజా ఘటన చర్చకు దారి తీసింది. డయల్- 100కు వచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసు సిబ్బందే.. మహిళలను బెదిరించి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు రావడం, ఆ తర్వాత ఉన్నతాధికారులను సైతం తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరిగిందనే సమాచారం పోలీసు శాఖలో కలకలం రేపుతోంది. ఈ ఆరోపణలు నిజమని తేలితే డయల్-100 వ్యవస్థ విశ్వసనీయతమైనే ప్రశ్నలు తలెత్తే పరిస్థితి ఏర్పడుతుంది. డయల్ 100 కాల్‌కు వెళ్లిన వారు తప్పుడు సమాచారం ఇవ్వడంపై కూడా పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది.

వ్యభిచార నిర్వాహకుడిపై చర్యలేవీ?

పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు.. డబ్బులు తీసుకున్నారనే దానిపైనే ఇంత వరకు చర్చ జరుగుతూ వచ్చింది. అయితే వ్యభిచార నిర్వాహకుడి గురించి ఎక్కడా మచ్చుకైనా ప్రస్తావన రాలేదు. పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లే సరికి మహిళలు ఇంట్లో నుంచి బయటికి వస్తున్నారని.. ఇంటి బయటే వారిని విచారణ చేయడం, తదితర పరిణామాలు చేసుకున్నాయని పోలీసు అధికారులు చెబుతున్న మాట. అయితే ఆ ప్రాంత వాసులు తెలిపే వివరాల ప్రకారం.. బైపాస్ రోడ్డులో అధికార పార్టీకి చెందిన ఒక వ్యక్తి కొందరు నాయకుల అండతో వ్యభిచారం, జూదం నిర్వహిస్తున్నాడు.. అతనే మహిళలను పిలిపించి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు చెప్పుకొంటున్నారు. అతను ఆ ప్రాంతంలోని ఓ నాయకుడి అండతో గలీజు దందా కొనసాగిస్తున్నాడని, సదరు వ్యక్తి గురించి పోలీసులకు తెలిసినా చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు వస్తున్నాయి. వ్యభిచారం వ్యవహారంలో కూడా అతనే సెటిల్‌మెంట్ చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పోలీసు అధికారులు మరింత లోతుగా విచారణ చేస్తే వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది.

నేటి నుంచి టీచర్లకు టెట్

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్) నిర్వహణకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయులందరూ ఈ అర్హత పరీక్ష రాయనున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ నెల 5వ తేదీ నుంచి 16వ తేదీ వరకు కంప్యూటర్ ఆధారిత పద్ధతిలో రోజుకు రెండు విడతల్లో (ఉదయం 9.30-12.00, మధ్యాహ్నం 2.30-5.00) పరీక్షలు జరగనున్నాయి. పదిహేను, ఇరవై ఏళ్లుగా బోధనలో ఉన్న సీనియర్ ఉపాధ్యాయులకు కొత్త సిలబస్, కంప్యూటర్ పరీక్ష విధానం పెద్ద సవాల్‌గా మారాయి. రోజంతా పాఠశాల విధుల్లో బిజీగా గడిపి, రాత్రిపూట పుస్తకాలతో కుస్తీ పడుతూ వారు పరీక్షకు సన్నద్ధమవుతున్నారు. పరీక్షలకు నిమిషం ఆలస్యమైనా గేట్లు మూసివేస్తారు. హాల్‌టికెట్‌తో పాటు ఆధార్ లేదా ఏదైనా ప్రభుత్వ ఒరిజినల్ ఐడీ కార్డు తప్పనిసరి. హాల్‌టికెట్‌లో ఫొటో లేని వారు రెండు పాస్‌పోర్ట్ ఫొటోలు, డిక్లరేషన్ ఇవ్వాలి. కేంద్రాల వివరాలు: కడపలో 5 కేంద్రాల్లో 9,469 మంది, ప్రొద్దుటూరులో 2 కేంద్రాల్లో 1,951 మంది, రాజంపేటలో ఒక కేంద్రంలో 369 మంది పరీక్ష రాయనున్నారు. 103 మంది దివ్యాంగులకు స్క్రైబ్స్‌ను కేటాయించారు. స్టేట్ అబ్జర్వర్‌గా పాఠ్యపుస్తకాల డైరెక్టర్ మధుసూదన్‌రావు పర్యవేక్షిస్తున్నారు. డీఈఓ షేక్ షంషుద్దీన్ మాట్లాడుతూ అభ్యర్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా కనీసం గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి.

హెల్ప్ లైన్ డెస్క్ ఏర్పాటు

జిల్లావ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభంకానున్న ఏపీ టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్(టెట్) సందర్భంగా అభ్యర్థుల సౌకర్యార్థం డీఈఓ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ లైన్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. ఈ టెట్ పరీక్షకు సంబంధించి ఏవైనా సందేహాలుంటే ఆగస్టు 5వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, సంప్రదించవచ్చని తెలిపారు. సందేహాలు, అత్యవసర సహాయం కోసం సహాయ సంచాలకులు 90594 09545, సూపరింటెండెంట్ 99481 21966, అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ 98499 00614 నెంబర్లను సంప్రదించాలని డీఈఓ తెలిపారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి పరామర్శ

నివాళులర్పిస్తున్న డీఈఓ షంషుద్దీన్

గోపవరం : మండలంలోని రామిరెడ్డిపాలెం ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు గువ్వల మల్లెంకొండయ్య సోమవారం పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన తెలిసిందే. ఆయన మృతదేహానికి బద్వేలు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.షంషుద్దీన్ మంగళవారం మృతుడి స్వగ్రామమైన బ్రాహ్మణపల్లెకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. బలవన్మరణానికి గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం ఎంఈఓలు రఘురాములు, చెన్నయ్యతో కలిసి.. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మల్లెంకొండయ్య ఉపాధ్యాయ వృత్తిలో ఎప్పుడూ గైర్హాజరు కావడం గానీ సమయ పాలన పాటించకపోవడం గానీ లేదని తెలిపారు. ఒకే పాఠశాలలో 8 ఏళ్లుగా పని చేశారంటే ఆయన పనితీరుకు అద్దం పడుతుందన్నారు. ఏది ఏమైనా బలవన్మరణానికి పాల్పడటం అత్యంత బాధాకరమని తెలిపారు. మధ్యాహ్నం 2-30 గంటలకు ఉపాధ్యాయుడి అంత్యక్రియలు నిర్వహించారు.

పాఠశాలకు సెలవు ప్రకటించిన అధికారులు

ఉపాధ్యాయుడు మృతి చెందడంతో జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం పాఠశాలకు సెలవు ప్రకటించారు.

ప్రారంభమైన అండర్-19 మల్టీడే మ్యాచ్‌లు

దేవ్ ప్రమోద్ (131 పరుగులు)

సాయి చరణ్ (6 వికెట్లు)

నాగకుళ్ళాయప్ప (94 పరుగులు)

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ సౌత్ జోన్ అండర్-19 మెన్ మల్టీడే ఇంటర్ జోనల్ రెండవ విడత మ్యాచ్‌లు ప్రారంభం అయ్యాయి. మంగళవారం కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో టీమ్- ఏ వర్సెస్ టీమ్-ఇ జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన టీమ్-ఇ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన టీమ్-ఎ జట్టు 75.5 ఓవర్లకు 305 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని దేవ్ ప్రమోద్ అద్భుతంగా బ్యాటింగ్ చేసి 153 బంతుల్లో 21 ఫోర్లు, 2 సిక్సర్లతో 131(సెంచరీ) చేశాడు. నాగకుళ్ళాయప్ప 94 పరుగులు చేశాడు. టీమ్-ఇ జట్టులోని శ్యామ్ దినేష్ 3, సాయి చరణ్ చక్కటి లైనఫ్‌తో బౌలింగ్ చేసి 6 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమ్-ఇ జట్టు 12 ఓవర్లకు వికెట్ నష్టపోకుండా 45 పరుగులు చేసింది. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

వైఎస్ఆర్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ..

అదే విధంగా వైఎస్ఆర్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో టీమ్-బీ వర్సెస్ టీమ్-సీ జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన టీమ్-బీ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. దీంతో తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమ్-బీ జట్టు 71.2 ఓవర్లకు 225 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని దేవాషిష్ 60, వినయ్ 46 పరుగులు చేశారు. టీమ్-సీ జట్టులోని తోషిత్ యాదవ్ 3, ప్రియతమ్ రాజ్ 2, కిరణ్‌కుమార్ 2, సాయి విష్ణుష్ 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమ్-సీ జట్టు 18 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 91 పరుగులు చేసింది. ఆ జట్టులోని హర్ష సాయి సాత్విక్ 62 పరుగులు చేశాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

పోలీసులు అడ్డుకోవడంతో ఆత్మహత్యాయత్నం

– కూటమి నేతల ఆదేశాలతో మహిళపై ప్రతాపం
– పొలంలో పనులు చేయొద్దని బెదిరింపులు

చికిత్స పొందుతున్న బాధితురాలు గౌతమి

సాక్షి టాస్కఫోర్స్ : మండల పరిధిలోని మాలెపాడు గ్రామంలో వ్యవసాయ పనుల్లో వరి నాట్లు వేస్తుండగా.. పోలీసులు వచ్చి అడ్డుకోవడంతో గౌతమి అనే మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఆమెను స్థానికులు ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా బాధితురాలు గౌతమి మాట్లాడుతూ వ్యవసాయ పనుల్లో వరి నాట్లు వేస్తుండగా పోలీసులు వచ్చి అడ్డుకున్నారని వాపోయింది. గ్రామంలోని కూటమి నేతలు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి ఆదేశాలతో జమ్మలమడుగు డీఎస్పీ సూచనల మేరకు కలమల్ల పోలీసులు వచ్చి అడ్డుకున్నారని ఆరోపించింది. పనులు చేస్తున్న కూలీలను కూడా బెదిరించారని ఆవేదన వ్యక్తం చేసింది. బూతులతో దర్భాష లాడటంతో అవమానం భరించలేక ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు వివరించింది. తమకు న్యాయం చేయాలని ఆమె జిల్లా ఎస్పీని కోరింది. ఈ విషయంపై కలమల్ల ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి వివరణ కోరగా.. మాలెపాడు గ్రామంలో వివాదాస్పదంగా మారిన వ్యవసాయ భూమి విషయంలో గతంలో ఘర్షణ జరిగిందన్నారు. ఆ భూమిలో ప్రస్తుతం పనులు చేస్తుండగా, ఈ భూమి వివాదాస్పదంగా ఉందని, పనులు చేయద్దని చెప్పడం జరిగిందన్నారు. వివాదాస్పదంగా ఉన్న భూమిలో పనులు చేస్తున్నారని ఎస్సీ వర్గానికి చెందిన వారు ఫోన్‌లో సమాచారం ఇవ్వడంతోనే పనులు చేయద్దని చెప్పడం జరిగిందన్నారు.

ట్యాంక్‌పై నుంచి పడి సెక్యూరిటీ గార్డు మృతి

మృతి చెందిన జి.బాలుడు

కడప అర్బన్ : కుటుంబ పోషణ కోసం వాచ్‌మెన్‌గా చేరిన ఓ వ్యక్తి విధి నిర్వహణలోనే ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయిన ఘటన కడపలో చోటుచేసుకుంది. ఖాజీపేట మండలం మిడుతూరు దళితవాడకు చెందిన గుండుగాళ్ల బాలుడు(40) కొద్ది కాలంగా కడపలో అరవింద్ నగర్‌లోని దుర్గా విల్లాస్ అపార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. నెల రోజుల క్రితమే అక్కడ ఉద్యోగంలో చేరిన ఆయన, మంగళవారం అపార్ట్‌మెంట్‌లోని నీటి ట్యాంకును శుభ్రం చేసేందుకు పైకి ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించినప్పటికీ, అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య గంగాదేవి, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబానికి ఏకైక ఆధారంగా ఉన్న బాలుడు ఆకస్మికంగా మృతి చెందడంతో భార్య, చిన్నారులు కన్నీరుమున్నీరవుతున్నారు. కుటుంబ పోషణ కోసం ఇంటి నుంచి దూరంగా వచ్చి ఉద్యోగంలో చేరిన నెల రోజుల్లోనే ఆయన మృత్యువాత పడడం అందరినీ కలచి వేసింది. సమాచారం అందుకున్న చిన్న చౌక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

విధుల్లో చేరిన డ్రైవర్

ప్రొద్దుటూరు : టీ కప్పు వివాదానికి సంబంధించి తొలగించిన జేసీబీ డ్రైవర్ బి.వెంకటేశ్వర్లు తిరిగి విధుల్లో చేరారు. ప్రొద్దుటూరులో గతంలో టీ కప్పు వివాదం పెద్ద కలకలం రేపిన విషయం తెలిసిందే. స్థానిక జార్జిక్లబ్ వద్ద ఉన్న టీ హోటల్‌లో వన్ బై టు కాఫీ ఇవ్వనందుకు అసిస్టెంట్ సిటీ ప్లానర్ చంద్రమోహన్ హోటల్ ఎంక్రోజ్‌మెంట్‌ను తొలగించాలని డ్రైవర్‌గా పని చేస్తున్న వెంకటేశ్వర్లును ఆదేశించారు. ఈ అంశానికి సంబంధించి చంద్రమోహన్‌ను సస్పెండ్ చేయగా, నాన్ పీహెచ్ వర్కర్‌గా పని చేస్తున్న వెంకటేశ్వర్లును విధుల నుంచి తొలగించారు. కొన్ని రోజుల పాటు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టడం, కలెక్టర్ ఆదేశాల మేరకు మళ్లీ విచారణ చేయడం జరిగింది. వెంకటేశ్వర్లు విధుల్లో చేరేందుకు సహకరించిన వారికి యూనియన్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

దళితులకు అన్యాయం జరగకూడదు

– సబ్ కలెక్టర్ హెచ్ఎస్ భావన

కడప సెవెన్‌రోడ్స్ : దళితులకు ఎక్కడా అన్యాయం జరగకుండా చూడడమే కాకుండా జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే.. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ లక్ష్యమని రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా హెచ్ఎస్ భావనతోపాటు డీఆర్వో మల్లికార్జునుడు, గౌరవ అతిథిగా బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన పరిహారం అందించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ (పీఓఏ) చట్టం కింద నమోదైన పెండింగ్, దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతిని సబ్ కలెక్టర్ పరిశీలించారు. బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ తమ నియోజకవర్గ పరిధిలోని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల ఆలస్యంపై సమీక్షించారు.

నెలలో వివాహం.. అంతలోనే విషాదం

– రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



శివశంకర్ (ఫైల్)

బద్వేలు అర్బన్ : ఆ యువకుడికి మరో నెల రోజుల్లో వివాహం జరిపించాలని పెద్దలు నిర్ణయించారు. అంతలోనే విధికి కన్ను కుట్టినట్లుంది. పెళ్లిపీటలు ఎక్కాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఈ హృదయ విషాదకర ఘటన బద్వేలు పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని కొత్తచెరువు గ్రామానికి చెందిన మల్లేష్, లక్ష్మమ్మలకు యమ్మని శివశంకర్(25) ఏకైక కుమారుడు. కొన్నేళ్ల క్రితం మల్లేష్ మృతి చెందడంతో శివశంకర్ ఇంటి పెద్దదిక్కుగా వ్యవహరిస్తూ గోపవరం సమీపంలోని సెంచూరీ పానెల్స్ పరిశ్రమలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుండే వాడు. రోజూ మాదిరే మంగళవారం తన ద్విచక్ర వాహనంలో డ్యూటీకి వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో సిద్దవటం రోడ్డులోని అబ్బుసాహెబ్‌పేట క్రాస్‌రోడ్డు - బయనపల్లె సబ్‌స్టేషన్ నడుమ ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు 108 సహాయంతో మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెళ్లి కుమారుడిగా చూడాలనుకుంటే అప్పుడే నూరేళ్లు నిండాయా అంటూ శివశంకర్ కుటుంబ సభ్యులు విలపించిన తీరు అక్కడి వారిని కలచివేసింది. ఘటనపై అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు.

వెంకట కృష్ణారావుకు ఘన నివాళి

కడప అర్బన్ : తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మండలి వెంకట కృష్ణారావు జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ కడప జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు పాల్గొని కృష్ణారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ 1926 ఆగస్టు 4వ తేదీన కృష్ణా జిల్లా కైకలూరులో జన్మించిన మండలి వెంకట కృష్ణారావు తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి అభివృద్ధికి విశేష కృషి చేశారని, ఆంధ్ర ప్రదేశ్ మాజీ మంత్రిగా అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి ప్రజల మన్ననలు పొందారన్నారు. దివిసీమ ఉప్పెన సంభవించిన సమయంలో బాధితులను ఆదుకోవడంలో ముందుండి సేవలందించిన ఆయనకు ×దివిసీమ గాంధీ అనే బిరుదు అందించారన్నారు. ఈ కార్యక్ర